గుట్టుగా గుడుంబా తయారీ!

- మండలంలో జోరుగా నాటుసారా విక్రయాలు
- మారుమూల ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు
- తనిఖీలు చేస్తున్నా ఆగని దందా

తిర్యాణి: మండలంలోని మారుమూల ప్రాంతాల్లో గుడుంబా (నాటుసారా) తయారీ జోరుగా సాగుతోంది. మండలంలోని 80శాతంపైగా పల్లెలు అటవీ ప్రాంతాల్లో ఉండటం అక్రమార్కులకు అనుకూలంగా మారింది. వాగును ఆనుకుని ఉండే అటవీ ప్రాంతాలను ఎంపిక చేసుకుని గుట్టు చప్పుడు కాకుండా గుడుంబా స్థావరాలు నిర్వహిస్తూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో తయారు చేసిన నాటుసారాను మండలంలోని దాదాపు అన్ని గ్రామాలకు తరలించి విక్రయాలు చేపడుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అటు పోలీసు సిబ్బంది, ఇటు ఆబ్కారీ శాఖ సిబ్బంది దాడులు చేస్తున్నా దందా మాత్రం ఆగడం లేదు. కాగా గత నెల 22న మండలంలోని మాణిక్యపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేసి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. వీటితో పాటు గంభీరావుపేట గ్రామంలో ఇటీవల నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో సైతం గుడుంబా లభ్యమవడం దందా నడుస్తున్నా తీరుకు అద్దం పడుతోంది.

ఆగని దందా..

మండలంలోని నాటుసారా స్థావరాలపై పోలీసు, ఆబ్కారీ శాఖ సిబ్బంది దాడులు చేస్తున్నా తయారీదారులు పట్టుబడుతున్నా దందా మాత్రం ఆగడం లేదు. నాటుసారా తయారీదారులు ప్రతీ గ్రామంలో 5 నుంచి 10 మంది విక్రయదారులకు బెల్ట్ షాపుల మాదిరి లీటరుకు రూ. 100 చొప్పున తీసుకుంటూ డోర్ డెలివరీ చేస్తున్నారు. దీంతో దాదాపు అన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా గుడుంబా లభ్యమవుతోంది. వైన్స్‌ల్లో విక్రయించే మద్యంతో పోలిస్తే గుడుంబా తక్కువ ధరకే లభ్యమవుతుండటంతో మందుబాబులు నాటుసారాను తాగేందుకు ఎగబడుతున్నారు. దీంతో తయారీదారుల దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. కాగా నాటుసారా తయారీలో హానికరమైన పటికతో పాటు మత్తునిచ్చే రసాయనాలు వినియోగిస్తుండగా ఈ మద్యానికి బానిసైన వారు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. చాలా కాలం పాటు నాటుసారా సేవిస్తే మనిషిలోని అవయవాలన్ని చెడిపోయి మృతి చెందే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హానికరమైన నాటుసారాను రూపుమాపడానికి పోలీసు, ఆబ్కారీ అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా ఉంచి పట్టుబడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని మండలంలోని నాటుసారా బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



గుడుంబా తయారీ కోసం వినియోగించే రసాయనాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)

కఠిన చర్యలు తీసుకుంటాం..



నాటుసారా తయారీదారుల ఎంతటి వారైనా సహించేది లేదు. శాఖాపరమైనా కఠిన చర్యలతో పాటుగా అవసరమైతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం. ఎక్కడైనా గుడుంబా తయారీ, విక్రయాలు జరుపుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– శ్రీకాంత్, ఎస్సై, తిర్యాణి

క్లుప్తంగా

15న సెలువు ప్రకటించాలి

లింగాపూర్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఈనెల 15న సెలువు ప్రకటించాలని, ఆసిఫాబాద్ జిల్లా సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈసారి సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించి సెలువుదినంగా ప్రకటించాలని కోరారు.

చేతిపంపునకు మరమ్మతులు



చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడ గ్రామంలో చేతి పంపు చెడిపోవడంతో మహిళలు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య సిబ్బందితో చేతిపంపునకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో కాలనీ మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: సమ్మర్ సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ ఏరియాలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ పనులు ఉన్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దస్నాపూర్, గ్రామపంచాయతీ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీరాజం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌటాల: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కౌటాల ఏడీఈ రాజేశ్వర్ సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గంట పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పశువుల వాహనం పట్టివేత

వాంకిడి: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని సోమవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వాంకిడి మండలంలోని టోల్‌ప్లాజా వద్ద సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా బొలేరో వాహనంలో 10 ఆవులు, 2 దూడలను సంబంధిత పత్రాలు లేకుండా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలోని గడ్‌చాందూర్‌కు చెందిన డ్రైవర్ అమీన్ షేక్, వ్యాపారి షారుక్ ఖాన్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా పశువులను నిజామాబాద్‌లోని సతాపూర్ మార్కెట్‌లో విక్రయానికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేంకటేశ్వర స్వామి ఆలయం పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవి కల్యాణాన్ని నిర్వహించారు.

నమూనా ఇంటి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న డీఈ వేణుగోపాల్

తిర్యాణి: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నమూనా ఇంటి నిర్మాణం కోసం సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అధికారులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ శాఖ డీఈ వేణుగోపాల్ మాట్లాడుతూ మండలానికి ఒక్క నమూనా ఇండ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేముల మల్లేశ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు తీరుస్తాం

సాక్షి ఎఫెక్ట్

దహెగాం: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం దిగిడలో నెలకొన్న సమస్యలపై ఈనెల 6న 'సాక్షి'లో సమస్యల్లో దిగిడ అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీల కారణంగా నీరు సరఫరా కాక నీటికి తిప్పలు పడుతున్నందున సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్ స్పందించి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు ప్రారంభించారు. గ్రామంలో రెండు చోట్ల లీకేజీలు ఉన్నాయని, వాటిని గుర్తించామని, రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి గ్రామస్తులకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.



పైప్‌లైన్ మరమ్మతులు పరిశీలిస్తున్న ఇనోస్

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

ఆసిఫాబాద్‌అర్బన్: నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్ చేపడుతున్నట్లు ఆసిఫాబాద్ సీఐ బుద్దె రవీందర్ అన్నారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 6 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఆర్‌ఆర్ కాలనీలో ఇంటింటికీ వెళ్తూ తనిఖీలు చేపట్టగా, వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేని 82 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్సైలు ప్రశాంత్, రాజేశ్వర్, అంజన్న, శ్యాంరావ్‌తో పాటు 60 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ రవీందర్

'ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాన్ని ఎండగడతాం'



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కౌటాల: రాజ్యాంగానికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగడతామని నవబుద్ధ సమాజ్ సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తు సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి విగ్రహం వద్ద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ జనాభా ఆధారంగా లెక్కలు తీసుకొని మహర్, మాల ఉపకులాలకు 5శాతం రిజర్వేషన్ ప్రకటించడం చాలా దారుణమన్నారు. 341 ఆర్టికల్‌ను అమలు పరిచే వరకు మాల, మహర్ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు బండురావ్, జానకిరావ్, ఏమాజీ, కిశోర్, జీవన్, అశోక్, ప్రకాశ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి: సింగరేణి పునరావాస గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పునరావాస గ్రామస్తులు సోమవారం హైదరాబాద్‌లో సింగరేణి సంస్థ సీఎండీ బలరాం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొలాం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం గంగరాం మాట్లాడుతూ పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు గోపాల్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పునరావాస గ్రామస్తులు

రెగ్యులర్ డీఎండబ్ల్యూవోను నియమించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో రెగ్యులర్ మైనార్టీ సంక్షేమ అధికారి (డీఎండబ్ల్యూవో)ను నియమించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్‌ల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఇన్‌చార్జి అధికారి వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరారు. నాయకులు కార్తీక్, దుర్గం దినకర్, సాయికృష్ణ, టీకానంద్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణ స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ వద్ద గల రైల్వే ట్రాక్‌పై చేపట్టనున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని సోమవారం అధికా రులు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, రైల్వేఆర్‌అండ్ ఇంజనీర్లతో కలిసి సంయుక్త పరిశీలన చేపట్టారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే వర్షపునీరు బయటకు ఎలా వెళ్లాలనే దానిపై పరిశీలించారు. పట్టణంలోని పంజాబ్‌చౌక్, మహలక్ష్మీవాడలోని ఆర్‌యుబీ వద్ద గల స్థలాన్ని పరిశీలించిన అధికారులు నీరు వెళ్లే మార్గంపై సాధ్యాసాధ్యాలను తెలుసుకున్నారు. మహలక్ష్మీవాడ ఆర్‌ఓబీ వద్దకు నీటిని మళ్లించడం అనుకూలంగా ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. పూర్తిస్థాయి అధ్యయనం చేపట్టాక తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెల్లడించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



పూజలు చేస్తున్న అనిల్ జాదవ్

తలమడుగు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం తలమడుగు మండలంలోని నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని ప్రారభించారు. అనంతరం ఆలయంలో విగ్రహాల ప్రతి ష్టాపన వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన ముడుపు భూమారెడ్డి, దామోదర్ రెడ్డి, ప్రేమేందర్ రెడ్డి, కేదారేశ్వర రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి నందిగామ గ్రామస్తులను గ్రామ పటేల్ మజాన్‌లను యువజన సంఘాల సభ్యులను అభినందించారు.

శివాలయానికి ఉత్సవ విగ్రహాల విరాళం

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయ ప్రాంగణంలో గల శివాలయానికి సింగరేణి రిటైర్డ్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి దంపతులు ఉత్సవ విగ్రహాలను విరాళంగా అందజేశారు. సోమవారం ఉత్సవ విగ్రహాలను ఆలయానికి సమర్పించారు. ఈసందర్భంగా రిటైర్డ్ జీఎం దంపతులతో పాటు ప్రస్తుత బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అందజేసిన రిటైర్డ్ జీఎం దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి శేష శయనరావు, మాజీ ఆలయ కార్యదర్శి ప్రకాశ్‌రావు, కమిటీ సభ్యులు మారం శ్రీనివాస్, దుర్గం తిరుపతి, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రిటైర్డ్ జీఎం సంజీవరెడ్డి దంపతులు, ఏరియా జీఎం శ్రీనివాస్

వనదేవతల మినీ జాతరకు ఏర్పాట్లు

రెబ్బెన: మండలంలోని లక్ష్మీపూర్ వాగు ఒడ్డున గల సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద మినీ జాతర కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతరను పురస్కరించుకుని సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దె రాజు గద్దెలకు రంగులు అద్ది ముస్తాబు చేశారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు సమ్మక్క, సారలమ్మ మినీ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గొల్లపెల్లి సత్తమ్మ, దేవార వినోద్‌లు తెలిపారు. మండలంలోని భక్తులు అమ్మల గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవచ్చని తెలిపారు.



రంగులు వేసి అందంగా ముస్తాబు చేసిన సమ్మక్క గద్దె, సారలమ్మ గద్దె

పూర్వ విద్యార్థుల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన: సింగరేణి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుత పదవ తరగతి విద్యార్థుల కోసం పుస్తకాలను సమకూర్చగా జీఎం చేతుల మీదుగా అందజేశారు. జీఎం మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం పూర్వ విద్యార్థులు పుస్తకాలను సమకూర్చడం అభినందనీయమన్నారు. పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థి సంఘం భవిష్యత్తులో మరెన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ ఆటు బడికి ఇటు పాఠశాల విద్యార్థులకు, సమాజానికి ఉపయోగపడేలా ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, హెచ్‌ఎం రవితేజ, పీఈటీ భాస్కర్, పూర్వ విద్యార్థులు కోట సుధాకర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

ఎంపీవో, పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండల పంచాయతీ అధికారి మోహన్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావుపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆదివాసీ పంచాయతీ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం మాట్లాడారు. ఏజెన్సీ పరిధిలోని జైనూర్ మండలంలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ చట్టాలు తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో 1/70, పెసా చట్టాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కూడా ఇవ్వడం లేదన్నారు. వారిపై చర్యలు తీసుకుని ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షేకు, భగవంత్‌రావు, సోనేరావ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మడావి మనోహర్

డిప్యూటీ సీఎంను కలిసిన మాలీ సంఘం నాయకులు

వాంకిడి: అఖిల భారతీయ మాలీ మహాసంఘం జాతీయ, రాష్ట్ర నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. ముందుగా పూలే తలపాగ, కండువా, గ్రంథాన్ని బహూకరించి సన్మానించారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణలోని మాలీలను ఎస్టీ జాబితాలో కలపాలని, పూలే దంపతుల జీవితచరిత్రలను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఇందుకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. సుకుమార్ పెట్కులే, దిలీప్, గణపతి నేవుసే, విలాస్‌రావు పాటిల్, డా.శ్యాంరావు పూలే, అఖిల్ వాగేల, వినోద నగోషే, గుర్నులె నారాయణ, సాంబన్న, గుర్నులె మెంగాజీ, కొట్రాంగె సాగర్, బెండారె కృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే

'టీబీ నిర్మూలనకు కృషి చేద్దాం'



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఇంద్రవెల్లి: టీబీ వ్యాధి నిర్మూలన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్నూర్ గ్రామానికి సందర్శించి టీబీ వ్యాధి నివారణ, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దగ్గు, జ్వరం, చాతిలో నొప్పి, ఆకలి లేకపోవడం, రాత్రి పూట నిద్రలో చెమటలు పట్టడం, అలసట, శ్వాస ఆడకపోవడం, దగ్గినప్పుడు రక్తం పడడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి గ్రస్తులను గుర్తించి పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 అందించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్, పూజిత, సీహెచ్‌వో సందీప్, హెచ్ఈవో రాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.